క్లుప్తంగా

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



నగరంపాలెం: స్థానిక లాలాపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. భక్తులు, కార్యాలయ ఉద్యోగ సిబ్బందికి రక్తపోటు, మధుమేహం, కంటి, దంత పరీక్షలు చేపట్టి, మందులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటించాలని దేవ స్థానం సహాయ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో తులసి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, వారాహి డెంటల్ క్లినిక్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ నిర్వాహకులు పాల్గొన్నారు.

మోదీ వాగ్దానాలు అమలు చేయాలి

లక్ష్మీపురం: దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ ఏడాది కోటి ఉద్యోగాల వాగ్దానాన్ని నిలుపుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక శారదాకాలనీ ఆర్చి సెంటర్ వద్ద అమరజీవి మామిళ్లపల్లి మాలకొండయ్య, గుర్రం బ్రహ్మయ్య వర్ధంతి సభ శనివారం నిర్వహించారు. తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి పాల్గొని ప్రసంగించారు.

కౌలు చెల్లింపు కోసం నిధులు కేటాయించటం హర్షణీయం

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతులకు పెండింగ్‌లో ఉన్న వార్షిక కౌలును చెల్లించాలని నిర్ణయించిన ప్రభుత్వానికి రాజధాని అమరావతి జేఏసీ సభ్యులు, అమరావతి రాజధాని రైతు సమీకరణ సమాఖ్య అధ్యక్షుడు మాదల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నందుకు ధన్యవాదాలు వెల్లడించారు.

కవి ఆత్రేయ చిరస్మరణీయుడు

లక్ష్మీపురం: ప్రేమకవి, మనసుకవి, మనసున్న కవిగా కీర్తించబడ్డ ఆత్రేయ చిరస్మరణీయుడని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సీనియర్ గాయకులు రత్నాజీ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ప్రముఖ కవి ఆత్రేయ వర్ధంతి శనివారం నిర్వహించారు.

వరద బాధితులకు మధుసూదనరావు రూ.10 లక్షల విరాళం



గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు గుంటూరుకు చెందిన ప్రముఖ ఆడిటర్ చుండూరి మధుసూదనరావు ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఈమేరకు వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి చెక్కు అందజేసినట్లు మధుసూదనరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

జిల్లా ఎస్పీకి సీఎం సహాయనిధి చెక్కు అందజేత



నగరంపాలెం: గుంటూరు, కృష్ణా జిల్లాలోని వరద బాధితులకు గుంటూరు పోలీస్‌పరేడ్ గ్రౌండ్స్ సిటీ వాకర్స్ అసోసియేషన్ సీఎం రిలీఫ్‌ఫండ్‌కు రూ. లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఈమేరకు చెక్కును శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు అందించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వరద బాధితులకు అసోసియేషన్ తరపున అందించిన సాయం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మినేని సీతారామయ్య, కార్యదర్శి నారదాసు కోటేశ్వరరావు, సభ్యులు ఏనుగుల రమణ, మధులాల్, తాళ్లూరి వెంకటేశ్వర్లు, బండి పూర్ణచంద్రరావు, గోపిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నగరంలో డ్రైయిన్ల ప్రక్షాళనకు చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు



డ్రైయిన్లపై ఆక్రమణలను దగ్గరుండి తొలగింపజేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో డ్రైయిన్ల ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో జీఎంసీ తరఫున చేపట్టిన సహాయక చర్యలు, డ్రైయిన్ల ఆక్రమణలు, పారిశుద్ధ్యం, స్ట్రీట్ వెండింగ్ జోన్లు, జీఎంసీ ఆదాయ వనరుల పెంపునకు కార్యాచరణ, స్వచ్ఛత హి సేవ తదితర అంశాలపై వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విజయవాడ నగరం ఇటీవల వరద ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిందని, అందుకు వర్షం నీరు డ్రైయిన్లలోకి వెళ్లడానికి డ్రైయిన్ల ఆక్రమణలు పెరగడం ప్రధాన కారణంగా ప్రభుత్వం గుర్తించినట్లు చెప్పారు. విజయవాడలోని 62వ డివిజన్‌కు ప్రత్యేక అధికారిగా అక్కడి ప్రజల కష్టాలు అతి చేరువగా గమనించినట్లు పేర్కొన్నారు. ఆక్రమణల వలన మేజర్ డ్రైయిన్లు బ్లాక్ అయ్యి, అంతర్గత డ్రైయిన్లు, రోడ్ల మీద నీరు వెళ్లడానికి వీలులేక ఇళ్లల్లోకి చేరి ప్రజా జీవనాన్ని అతలాకుతలం చేసిందన్నారు.

ఆక్రమణలు తొలగింపు..

విజయవాడ వరద అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని గుంటూరు నగరంలో కూడా ప్రధాన డ్రైన్లపై ఆక్రమణల తొలగింపు ప్రారంభించినట్లు చెప్పారు. పది రోజుల్లో డ్రైయిన్ల మీద ఆక్రమణలను వారే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకుంటే పొక్లెయిన్ ద్వారా నగరపాలక సంస్థ సిబ్బంది తొలగిస్తారని స్పష్టం చేశారు. ఇప్పటికే క్షేత్ర స్థాయి పర్యటనలో నగరంలోని ఓల్డ్ క్లబ్ రోడ్ డ్రైయిన్‌ను పరిశీలిస్తే పూడిక, వ్యర్థాలతో ఉండి, ఆక్రమణలతో అత్యంత దారుణంగా ఉందన్నారు. గుంటూరు నగర ప్రజారోగ్య కార్మికులు, చెత్త తరలింపు వాహనాలు విజయవాడకు సహాయ చర్యల కోసం వెళ్లడం వలన కొంత పారిశుద్ధ్య సమస్యలు తలెత్తాయని, రానున్న మూడు రోజుల్లో అదనపు కార్మికులు, యంత్రాల ద్వారా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. త్వరలో వీధి వ్యాపారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రెడ్, గ్రీన్, అంబర్ స్ట్రీట్ వెండింగ్ జోన్ల ఏర్పాటుకు అధికారులు, వివిధ సంస్థల భాగస్వామ్యంతో కమిటీ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. జీఎంసీ ఆదాయానికి గండి పడే చర్యలు ఎవరు చేసినా ఉపేక్షించబోమని, ఆస్తి పన్ను విధింపు, తాగునీటి కుళాయి మీటర్లు, అనధికార నిర్మాణాలపై తమకు వివిధ వర్గాల నుంచి ఫిర్యాదులు అందాయని, వాటిని త్వరలో క్షేత్ర స్థాయి పరిశీలన చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఓల్డ్ క్లబ్ రోడ్డులో డ్రైయిన్లపై ఆక్రమణలు తొలగింపు

నెహ్రూనగర్: కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్, రైలు పేట, పాత్తూరి వారి తోట, గుంటూరువారి తోట తదితర ప్రాంతాల్లో డ్రైయిన్ల ఆక్రమణల తొలగింపు క్షేత్ర స్థాయిలో కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు నగరంలో డ్రైన్లపై ఆక్రమణల వలన ఇటీవల కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. పూడిక తీయడానికి కూడా ర్యాంప్‌లు, ఆక్రమణలు ఉన్నాయని, తక్షణం వాటిని తొలగించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట తూర్పు ఎంహెచ్‌ఓ (ఇన్‌చార్జి) రామారావు, డీఈఈ రాము, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్ పాల్గొన్నారు.

కలెక్టర్ నాగలక్ష్మిని కలిసిన ఉద్యోగ సంఘం నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

లక్ష్మీపురం: ఇప్పటి వరకు కేఆర్ సూర్యనారాయణ సారథ్యంలో పని చేసిన జిల్లా సంఘం అధ్యక్షుడు జారీ చేయబడిన ఉద్యోగుల బదిలీలలో మినహాయింపు ధ్రువ పత్రాలను ఆమోదించ వద్దని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి వివిధ శాఖలకు ఆదేశాలు జారీ చేయడంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు పవన్ కుమార్, జిల్లా కార్యదర్శి అమ్మయ్య కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు జిల్లా కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొద్ది సంవత్సరాలుగా కేఆర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీజీఈఏ సంఘం నుంచి వారిని బహిష్కరించిన తరువాత ప్రస్తుతం డి.శ్రీకాంత్ రాజు, జి.ఆస్కార్ రావు నేతృత్వంలో పని చేస్తున్న ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా శాఖ కార్యవర్గ సభ్యులు, జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారిని కలవడం జరిగిందన్నారు. అంతేకాకుండా గతంలో కూడా ఇదే విధంగా ఉద్యోగుల బదిలీలలో మినహాయింపు ధ్రువ పత్రాలు జారీపై, ఆరేళ్లుగా సంఘం పేరుతో వసూలు చేయబడి నిధుల తాలూకా ఖర్చులలో అవకతవకలపై విచారణ చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. ఈ విషయంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు. జిల్లా కలెక్టర్‌ను వినతిపత్రం ఇచ్చిన వారిలో కార్యవర్గ సభ్యులు మహబూబ్ బాషా, శేషారావు, మహేష్, సుజాత, సాంబశివరావు, భరత్,షఫీ హమ్మద్, రమేష్,జిలాని,శ్యామ్ పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకోవడం సామాజిక బాధ్యత



బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న కేవీ బ్రహ్మం

గుంటూరు ఎడ్యుకేషన్: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం సామాజిక బాధ్యతగా భావించాలని టీజేపీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ పేర్కొన్నారు. శనివారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలకు చెందిన 50 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు విజయవాడలో వరద బాధితుల సహాయార్థం ప్రత్యేక బస్సులో బయలుదేరి వెళ్లారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ వరదల కారణంగా ఎంతో నష్టపోయిన ప్రజలకు సహాయ చర్యలు చేయడం సాటి మనుషులుగా కనీస బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి జేవీ సుధీర్‌కుమార్, ఎన్‌సీసీ అధికారి పి.కుమార్ రాజా, ఆర్.జయశైలజ పాల్గొన్నారు.

గాడిచర్ల సర్వోత్తమరావు జయంతి..

గ్రంథాలయ ఉద్యమనేత గాడిచర్ల సర్వోత్తమరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతి గ్రామంలో తప్పనిసరిగా గ్రంథాలయం ఉండాలని, తద్వారా ప్రజల్లో నిరక్షరాస్యత తొలగిపోయి అభివృద్ధిలో నడుస్తున్నారని చెప్పారు.

హిందీ భాష గొప్పతనాన్ని గుర్తించాలి



ప్రజ్ఞ స్కూల్లో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న చక్రనాగ్



సుమేధ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులు



కేఎల్పీ స్కూల్‌లో వివిధ రాష్ట్రాల వస్త్రధారణ విద్యార్థినులతో ప్రిన్సిపాల్ రత్తయ్య



శ్రీపాటిబండ్ల సీతారామయ్య స్కూల్‌లో..

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలోని ప్రతి ఒక్కరూ హిందీ భాష గొప్పతనాన్ని గుర్తించాలని సుమేధ హైస్కూల్ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో శనివారం హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారు.

-నగరంపాలెంలోని ప్రజ్ఞ స్కూల్లో హిందీ దివస్ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎస్.చక్రనాగ్ బహుమతులు అందజేశారు.

-జాతీయోద్యమంలో కీలకపాత్ర పోషించిన హిందీ భాష భారతావనిని జాగృతం చేసిందని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని సీతారామయ్య పాఠశాలలో హిందీభాష గొప్పతనాన్ని తెలియజేసి, పాటలు, నృత్యాలుతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కో-ఆర్డినేటర్లు దుర్గా శ్యామ్, శ్రీదేవి పాల్గొన్నారు.

-జేకేసీ కళాశాలరోడ్డులోని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్లో శనివారం జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు హిందీ భాషలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, జేకేసీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ సీహెచ్ సునీత, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య పాల్గొన్నారు.

-మన జాతీయ భాష హిందీ దేశంలో మొదటి స్థానంలోనూ, ప్రపంచస్థాయిలో మూడోస్థానంలో నిలిచిందని కెనడి నెక్స్‌జెన్ పాఠశాల డైరెక్టర్లు కె.శ్రీకాంత్ బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య, అన్నారు. అరండల్‌పేట 2వలైనులోని కెనడి నెక్స్‌జెన్, కెనడి ఇంగ్లిష్ మీడియం మెరిట్ క్యాంపస్ పాఠశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు హిందీ భాషా గొప్పతనాన్ని డాక్టర్ శ్రీవిద్య వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఐజాక్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, హిందీ ఉపాధ్యాయురాలు ఎస్.డి.ఎల్.సుజాత, సుఫియా, మాధవి, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖలో సెబ్ విలీనంపై హర్షం

నెహ్రూనగర్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను ఎక్సైజ్‌శాఖలో విలీనం చేయడంపై ఎక్సైజ్ శాఖ అధికారులు శనివారం సంబరాలు చేసుకున్నారు. ఈమేరకు సీఎం చంద్రబాబునాయుడు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ బాబ్జీరావు, ఏపీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్స్ అండ్ హెడ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మార్పు కోటయ్య పాల్గొన్నారు.

శ్యామలకు గాయత్రీ సంగీత విద్వన్మణి బిరుదు ప్రదానం



శ్యామలకు బిరుదు ప్రదానం చేస్తున్న అతిథులు

నగరంపాలెం: కృషితో ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలు చేరవచ్చునని బండి శ్యామల నిరూపించారని ఏపీ జ్యూడీషియల్ అకాడమి డైరెక్టర్ అవధానం హరిహరనాథ్‌శర్మ అన్నారు. గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదికపై శనివారం వీణా గాన సరస్వతి బండి శ్యామలకు 'గాయత్రీ సంగీత విద్వన్మణి బిరుదు ప్రదానం చేసి సత్కరించారు. ఏపీ హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్, న్యాయవాది బి.వసంతలక్ష్మి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన హరిహరనాథ్‌శర్మ మాట్లాడుతూ బండి శ్యామల ఎంచుకున్న కళా రంగంలో నిర్విరామంగా కృషి చేశారని అన్నారు. పలు సభల్లో వీణా వాయిద్య కచేరీలను నిర్వహించి ఈ స్థాయికి చేరారని పేర్కొన్నారు. సభలో నంబూరు చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ కొండా కోటిరెడ్డి, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, నృత్య కళాప్రపూర్ణ డాక్టర్ కాజా సుబ్రహ్మణ్యం, ప్రముఖ హరికథకులు తుర్లపాటి శంభయాచారి, ప్రధాన కార్యదర్శి ఎంవై.శేషరాణి, ఉపాధ్యక్షులు డాక్టర్ రాజరాజేశ్వరి, ఎం.మీనాక్షి, పి.లలితదేవి, కార్యదర్శి ఎ.మంగాదేవి, కోశాధికారి ఎం.విజయలక్ష్మి, ఉపకార్యదర్శి ఎం.మాధవీకృష్ణ పాల్గొనగా, వీణాగాన సరస్వతి బండి శ్యామల వీణా వాయిద్య సంగీత కచేరీ నిర్వహించారు.

తెలుగు భాష, సంస్కృతులను కాపాడుకోవాలి



వెంకటరమేష్‌ను సత్కరిస్తున్న అతిథులు

నగరంపాలెం: దేశ చరిత్రలో తెలుగు భాష, సంస్కృతుల గొప్పదనాన్ని కాపాడాల్సిన బాధ్యత వర్తమాన సమాజంలోని మేధావులు, విద్యావంతులు, యువతరంపై ఉందని తెలుగు భాషోద్యమ సమాఖ్య గౌరవాధ్యక్షులు, అమ్మనుడి పత్రిక సంపాదకులు సామల రమేష్‌బాబు అన్నారు. 1953, 56లో భాషా రాష్ట్రాల పేరుతో ఏర్పడిన కృత్రిమ ఎల్లలకు బయట ఉన్న తెలుగు వారి కోసం తెలుగు నుడి సంస్కృతుల పరిరక్షణ కోసం ఉద్యమ రూపంగా కృషి చేస్తున్న సన్నాడి వెంకట రమేష్(స వెం రమేష్)ను బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నగరంపాలెంలో రూ.2 లక్షలు, ప్రశంస పత్రంతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ గారపాటి ఉమామహేశ్వరరావు, ఉప సంపాదకులు ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు ప్రసంగించారు. సన్మాన గ్రహీత రమేష్ మాట్లాడుతూ తెలుగు భాష, కళలు, సంస్కృతుల పరిరక్షణకు ఉద్యమ రూపం దాల్చాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెనిశెట్టి సింగారావు, మోదుగుల రవికృష్ణ, ఫౌండేషన్ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణపై అవగాహన ర్యాలీ

గుంటూరు ఎడ్యుకేషన్: బ్రాడీపేటలోని బీహెచ్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు శనివారం ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ బీవీ విజయభాస్కర్, కార్యదర్శి చేగు శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కౌసల్యాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాధామాధవి పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు

లక్ష్మీపురం: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి అన్నారు. పాత గుంటూరు సీఐటీయూ కార్యాలయంలో శనివారం సీతారాం సంతాప సభ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టి.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా తాను నమ్మిన సిద్ధాంతం కోసం నిరంతరం పనిచేశారని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డి.లక్ష్మీనారాయణ, బి.లక్ష్మణరావు, శ్రీనివాస్, రషీద్, చింతల శ్రీనివాస్, మురళి, ఎల్.అరుణ, రమణ, కృష్ణకుమారి, అంకమ్మ, చెల్లెమ్మ పాల్గొన్నారు.

వినాయక చవితి పందిళ్లలో అన్నదానం



అన్నదానం చేస్తున్న మేయర్ కావటి



నెహ్రూనగర్ 11వ లైనులో అన్నదానం..

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా సాగుతున్నాయి. వినాయకచవితి పందిళ్ల వద్ద అన్నదానాలు పెద్ద ఎత్తున నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. 13వ డివిజన్ లాంచెస్టర్ రోడ్డులో గణేష్ ఫ్రెండ్ సర్కిల్ యూత్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో జరుగుతున్న 9వ గణపతి మహోత్సవాల్లో నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. నెహ్రూనగర్ 11వ లైను న్యూగుంటూరు రైల్వే స్టేషన్ రోడ్డులో సాయి విఘ్నేశ్వర ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకల్లో భాగంగా శనివారం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు, మంత్రి సాయి, అంజన్న, సన్నీ, రవి, దేవరాజ్, సత్యనారాయణ, కె చంద్రశేఖర్, సాంబశివరావు, పి జగదీష్, తరుణ్, ప్రిన్స్, శివాజీ, మహేష్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఇంటర్ విద్యార్థిని మృతి

పట్నంబజారు: అనుమానాస్పద స్థితిలో ఇంటర్ విద్యార్థిని మృతి చెందడంపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. పల్నాడు జిల్లా, రాజుపాలెం మండలం, అంకెలవారిపాలేనికి చెందిన వేపూరి దివ్య(17) గుంటూరులో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కొద్దిరోజుల క్రితం ఇంటికి వెళ్లిన దివ్య ఈనెల 13వ తేదీ సాయంత్రం హాస్టల్ వద్దకు వచ్చి తన గదిలో ఆత్మహత్యకు పాల్పడింది. మృతికి గల కారణాలు తెలియరాలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జీజీహెచ్‌లో అరుదైన గుండె ఆపరేషన్



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ కార్డియోథొరాసిక్ సర్జరీ వైద్య విభాగం(సీటీవీఎస్)వైద్యులు అత్యంత అరుదైన గుండె ఆపరేషన్ చేసి ప్రాణాపాయ స్థితిలో చికిత్స కోసం వచ్చిన యువకుడి గుండెకు ఊపిరిపోశారు. అవనిగడ్డ నియోజకవర్గం కోడూరుకు చెందిన 25 ఏళ్ల శశికాంత్‌కు పదేళ్ల క్రితం గుండె ఆపరేషన్ జరిగింది. ఆ సమయంలో యువకుడి గుండె కొట్టుకునే వేగం తగ్గి స్పృహ కోల్పోయి పడిపోవటంతో గుండెను కృత్రిమంగా కొట్టుకునేలా పేస్‌మేకర్ అనే బ్యాటరీతో నడిచే పరికరాన్ని గుండెలో వైరుపెట్టి అమర్చారు. ప్రస్తుతం గుండెలో ఉన్న వైర్‌కు ఇన్‌ఫెక్షన్ సోకి రెండు నెలలుగా తీవ్రమైన చలిజ్వరంతో బాధపడుతున్నాడు. అన్ని ఆస్పత్రుల్లో చూపిన ఫలితం లేకుండా పోయింది. ప్రముఖ గుండె మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు, స్వహృదయ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే సూచనతో శశికాంత్ జీజీహెచ్‌కు వారం రోజుల క్రితం వచ్చాడు. యువకుడికి పరీక్షలు చేసి గుండె కవాటాల్లో మధ్యలో ఉన్న వైర్‌ను తీసివేయటం ద్వారా తీవ్ర జ్వరం నియంత్రణలోకి వస్తుందని నిర్ధారించారు. శుక్రవారం సీటీవీఎస్ వైద్యులు సుమారు మూడు గంటలసేపు కార్డియో పల్మనరీ బైపాస్ విత్ రైట్ అరిటోమా ఆపరేషన్ చేసి గుండె కవాటాల్లో ఇరుక్కున్న తీగ వంటి లీడ్‌ను అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పేరం కుప్పుస్వామి తొలగించారు. వైర్ గుండె కవాటాల్లో ఉండటం వల్ల దెబ్బతిన్న కవాటాలను రిపేర్ చేసి గుండె సాధారణ వేగంలో కొట్టుకునేలా ఆపరేషన్ చేశారు. ఈ విషయాన్ని శనివారం మీడియాకు వెల్లడించారు. ఎంతో క్లిష్టమైన సుమారు ఏడు లక్షల ఖరీదు చేసే ఆపరేషన్‌ను పూర్తి ఉచితంగా చేసినట్లు సీటీవీస్ వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పేరం కుప్పుస్వామి తెలిపారు. డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణగోఖలే, డాక్టర్ కోనేరు సుధాకర్ పర్యవేక్షణలో నిర్వహించిన ఆపరేషన్‌లో సీటీవీఎస్ విభాగాధిపతి హరికృష్ణమూర్తి, మత్తు వైద్య విభాగాధిపతి పోలయ్య, అసోసియేట్ డాక్టర్ ఎమీమా, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రమోదా, ఎస్.వి.రామరాజు పాల్గొన్నట్లు వెల్లడించారు.